

24 గంటలు అప్రమత్తంగా ఉండాలి

వీసీలో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

- సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది విధుల్లో చేరాలి
- సహాయక చర్యల కోసం జిల్లాకు రూ.కోటి నిధులు
- వీసీలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి, తుమ్మల

మహబూబాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా మారో రెండు, మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు మరింత అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సూచించారు. వర్షాలతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. హైదరాబాద్ నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి గురువారం అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ గడిచిన మూడు రోజుల్లో ఊహించిన దాని కంటే ఎక్కువ, మరి కొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షపాతం నమోదైందని.. వీటిని దృష్టిలో పెట్టుకుని వచ్చే రోజుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సహాయక చర్యల కోసం జిల్లాకు కోటి రూపాయలు విడుదల చేశామని, అవసరమైతే మరిన్ని నిధులు విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు గాను ఉమ్మడి 10 జిల్లాలకు సీనియర్ అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించడం జరిగిందన్నారు. వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు, వరద ముంపు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యల గూర్చి ఆదేశాలు జారీ చేశారు. లోలెవల్ బ్రిడ్జీల వద్ద పోలీస్ సిబ్బందిని నియమించాలనిసూచించారు. సెలవుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది వెంటనే విధుల్లో చేరాలన్నారు. జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో 1590 చెరువులు, కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాలను గుర్తించి ఇప్పటికే ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. జిల్లాస్థాయి నుంచి గ్రామస్థాయి వరకు అధికారులు స్థానికంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ వీసీలో ఆర్డీవో కృష్ణవేణి, జిల్లా అధికారులు పురుషోత్తం, మధుసూదనరాజు, నర్సింహస్వామి, బీమ్లా నాయక్, నర్సింహమూర్తి, హరిప్రసాద్, విజయనిర్మల, ప్రేమ్‌కుమార్, వేముల సురేష్, పవన్‌కుమార్ పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న అన్నదాతలు

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

- వరంగల్-ఖమ్మం హైవేపై కర్షకుల ధర్నా

10



మానుకోట ఎన్టీఆర్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం సిద్ధమైన వేదిక

పంద్రాగస్టుకు సర్వం సిద్ధం

- నేడు మానుకోటలో స్వాతంత్ర్య వేడుకలు
- పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం ముస్తాబు
- ఏర్పాట్లను పరిశీలించిన ఇన్‌చార్జి కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మానుకోట పట్టణంలో శుక్రవారం జరిగే పంద్రాగస్టు వేడుకలకు ఎన్టీఆర్ స్టేడియం ముస్తాబైంది. ఉదయం జరిగే వేడుకలకు క్రీడాప్రాంగణాన్ని జిల్లా అధికార యంత్రాంగం సిద్ధం చేసింది. 2016లో మహబూబాబాద్ నూతన జిల్లాగా ఆవిర్భవించిన నాటి నుంచి స్వాతంత్ర్య, గణతంత్ర్య దినోత్సవ వేడుకలను ఏటా పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నారు.

మహబూబాబాద్‌లో నేడు జరిగే 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కోసం అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ముఖ్యఅతిథి ప్రసంగించేందుకు ప్రత్యేకంగా వేదికను సిద్ధం చేశారు. ఆ వేదికకు కుడి, ఎడమ వైపు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమరయోధులు, అధికారులు కూర్చునేందుకు షామియానాలు ఏర్పాటు చేశారు. జిల్లాలోని వివిధ శాఖల్లో జరిగిన అభివృద్ధిని వివరించే స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్న ప్రభుత్వ విప్..



జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ప్రభుత్వవిప్, డోర్నకల్ శాసనసభ్యుడు జాటోతు రాంచందర్‌నాయక్ హాజరు కానున్నారు. ఉదయం 9.30 గంటలకు రాంచందర్‌నాయక్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నారు. 9.31 గంటలకు జాతీయ గీతాలపన, 9.35 గంటలకు పోలీసులచే గౌరవ వందనం స్వీకరిస్తారు. 9.40 గంటలకు ముఖ్య అతిథి ప్రసంగం, 9.55 గంటలకు స్వాతంత్ర్య సమర యోధులకు సన్మానం, 10.10 గంటలకు సాంస్కృతిక ప్రదర్శనలు, 10.30 గంటలకు ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశాంసా పత్రాల ప్రదానం, 11 గంటలకు వివిధ శాఖల స్టాళ్ల సందర్శనతో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ముగియనున్నాయి.

ఎన్టీఆర్ స్టేడియాన్ని సందర్శించిన లెనిన్‌వత్సల్ టొప్పో..

మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లను జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడులకు ముఖ్యఅతిథిగా ప్రభుత్వవిప్ జాటోతు రాంచందర్‌నాయక్ హాజరవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు, అతిథులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వేడుకలకు హాజరయ్యే స్వాతంత్ర్యసమరయోధులు, అధికారులు, ప్రజా ప్రతినిధులకు ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాట్లు చేయాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్ ను సిద్ధం చేయాలని సూచించారు. అధికారులంతా సమన్వయంతో పని చేసి వేడుకలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ కె.అనిల్‌కుమార్, ఆర్డీవో కృష్ణవేణి, అధికారులు మధుసూదన్‌రాజు, భీమ్లానాయక్, రవీందర్‌రెడ్డి, మరియన్న, రాజేశ్వర్ పాల్గొన్నారు.




ఎన్టీఆర్ స్టేడియంలో స్వాతంత్ర్య దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న లెనిన్‌వత్సల్ టొప్పో

ప్రధానిని కలిసిన ధన్నసరి వాసి

- కుమారునికి శ్రేష్ఠలో ఆల్‌ఇండియా ర్యాంకు వచ్చినందుకు కలిసిన తండ్రి

కేసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో బుధవారం రాత్రి కేసముద్రం మండలం ధన్నసరికి చెందిన పట్ల రవి ఆయన భార్య కృష్ణవేణి, కుమారుడు గౌతమ్‌లు ప్రధాని మోదీని కలిశారు. ఎస్‌సీలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విద్యనందించే 'స్కీమ్ ఫర్ హైయ్యర్ ఎడ్యుకేషన్ రియలైజింగ్ ఎడ్యుకేషనల్ స్పిరిట్ థ్రూ హోలిస్టిక్ ట్రైనింగ్ అండ్ అకాడమిక్ సపోర్ట్(శ్రేష్ఠ) ప్రవేశపరీక్ష ఫలితాలు ఈ ఏడాది జూన్22న విడుదల కాగా ఈ పరీక్షలో గౌతమ్ ఆల్‌ఇండియా మొదటి ర్యాంకు సాధించాడు. ఇటీవలె డెహ్రడూన్‌లోని మహానంద మెమోరియల్ స్కూల్లో ఈ విద్యార్థిని చేర్పించారు. ఈ మేరకు ప్రధానిని కలిసి కృతజ్ఞతలు తెలిపేందుకు దరఖాస్తు చేసుకోగా బుధవారం రాత్రి ఈ కుటుంబం మోదీని కలిసి ధన్యవాదాలు తెలిపారు.



ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన పట్ల రవి



బహుజన వీరుడు సర్వాయి పాపన్నగౌడ్

- మానుకోట జిల్లా కేంద్రంలో విగ్రహం ఏర్పాటు
- రేపు అతిరథ మహారథులచే ఆవిష్కరణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన విగ్రహ నిర్మాణ కమిటీ
- పెద్ద సంఖ్యలో గౌడ కులస్థులు తరలిరావాలని విజ్ఞప్తి

8

కుష్ఠువ్యాధి రహిత సమాజ స్థాపనకు కృషి

- జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రవిరాథోడ్

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కుష్ఠువ్యాధి రహిత సమాజ స్థాపనకు వైద్య సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శా ఖ అధికారి భూక్య రవిరాథోడ్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా వైద్యశాఖ కార్యాలయంలో గురువారం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో కుష్ఠువ్యాధి సంబంధించిన రికార్డులను పరిశీలించి, వివరాలను లెప్రసి నో డల్ సూపర్‌వైజర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లాలో త్వరలో జాతీయ పరిశీలక బృం దం పర్యటన ఉంటుందని, సింపుల్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్‌లో ఉన్నటువంటి 7రకాల రికార్డులను సక్రమంగా నిర్వహించాలన్నారు. కుష్ఠువ్యాధిగ్రస్తులను ముందుగానే గుర్తించి చికిత్స అందించడం వల్ల అంగవైకల్యాన్ని నివారించవచ్చన్నారు. దీనిలో బాగంగా ఆశావర్కర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటా సర్వే నిర్వహించి స్పర్శలేని మచ్చలను, రాగివర్ణం కలిగిన మచ్చలను గుర్తించాలన్నారు. స్పర్శలేని మచ్చలు ఉన్నవారిని గుర్తించి స్థానిక పీహెచ్‌సీ వైద్యులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లోని వైద్య సిబ్బంది సమిష్టిగా పనిచేసి కుష్ఠువ్యాధి రహిత సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో లెప్రసీ, ఎయిడ్స్ ప్రోగ్రాం అధికారి విజయ్‌కుమార్, జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి ప్రసాద్, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్ వాల్యా ఎల్లయ్య, సబ్ యూనిట్ అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవిరాథోడ్

జిల్లా బీజేపీ నూతన కమిటీ ఎన్నిక



మానుకోటలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో నూతన కమిటీని ప్రకటిస్తున్న జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ (బీజేపీ) మహబూబాబాద్ జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు తెలిపారు. మహబూబాబాద్ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జిల్లా ఉపాధ్యక్షులుగా చెల్పూరి వెంకన్న (గూడూరు), పొదిళ్ల నర్సింహారెడ్డి (కేసముద్రం), ఓర్సు పద్మావతి (మహబూబాబాద్), మేరెడ్డి సురేందర్ (గూడూరు), గుగులోతు దేవిక (డోర్నకల్) ఎన్నికున్నట్లు చెప్పారు. ప్రధాన కార్యదర్శులుగా చీకటి మహేష్‌గౌడ్ (దంతాలపల్లి), గడ్డం అశోక్‌కుమార్ (మహబూబాబాద్), గుగులోతు మదన్‌నాయక్ (నెల్లికుదురు), జిల్లా కార్యదర్శులుగా దారా ఇందుభారతి (మహబూబాబాద్), సింగారపు సతీష్ (మహబూబాబాద్), శ్రీరామోజు నాగరాజు (కురవి), పూసం మణిచందన (గూడూరు), పాల్వాయి మమత (మరిపెడ) ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కోశాధికారిగా జాటోతు మోదిన్‌నాయక్ (గూడూరు), ఆఫీస్ సెక్రటరీగా పల్లె సందీప్ (మహబూబాబాద్), సోషల్ మీడియా ఇన్చార్జిగా జాటోతు వెంకన్ననాయక్ (గూడూరు), మీడియా కన్వీనర్‌గా గాదె విష్ణువర్ధన్‌రెడ్డి (మహబూబాబాద్), ఐటీ ఇన్చార్జిగా ధర్మారపు వెంకన్న (దంతాలపల్లి) లను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా

- పోలీస్‌స్టేషన్ల పరిధిలో సైబర్ వారియర్స్ నియామకం
- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

10



ఎరువుల అమ్మకం కేంద్రం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

యూరియా కోసం రైతుల నిరసన

ఇనుగుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలం కేంద్రంలోని కేసముద్రం సొసైటీకి చెందిన ఎరువుల అమ్మకం కేంద్రం వద్ద పలువురు రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు యూరియాను అందుబాటులో ఉంచాలని నినాదాలు చేశారు. వారం రోజులుగా యూరియా బస్తాలు లేక తాము ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా వెంటనే ప్రభుత్వం స్పందించి యూరియాను తెప్పించాలని డిమాండ్ చేశారు.

రెండు ఇళ్లలో చోరీ

14 గ్రాముల బంగారం, 20 తులాల వెండి అపహరణ

ఇనుగుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఇనుగుర్తి మండల కేంద్రంలో బుధవారం రాత్రి వల్లంల ఉప్పమ్మ, వల్లంల శాంతమ్మ ఇళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారని కేసముద్రం ఎస్ఐ2 గంగారపు కరుణాకర్ తెలిపారు. ఊరిచివరన ఉండే వీరు ఇంటికి తాళం వేసి ఒకరు గ్రామంలో, మరొకరు చెట్లముప్పారంలోని బంధువుల ఇళ్లకు వెళ్లారు. దీంతో గుర్తుతెలియని వ్యక్తులు బయట తాళం పగులగొట్టి ఇళ్లలోకి ప్రవేశించి ఇళ్లలోని బీరువాలను పగుల గొట్టి 14 గ్రాముల బంగారు ఉంగరం, కమ్మలు, ముక్కుపుడక, 20 తులాల వెండి పట్టీలు చోరీ ఎత్తుకెళ్లినట్లు ఎస్ఐ తెలిపారు. గురువారం బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించినట్లు ఎస్ఐ వివరించారు.

కాళేశ్వరాలయంలో టెండర్లు

మహదేవపూర్, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం ఆలయంలో గురువారం టెండర్లను ఈవో మహేష్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. సీల్డ్ టెండర్, బహిరంగ వేలం కలిపి ఆరు టెండర్లు నిర్వహించారు. టెండర్ పర్యవేక్షణాధికారిగా బిల్లా శ్రీనివాస్ వ్యవహరించారు. భక్తుల పాదరక్షలు, బ్యాగులు, లగేజీ భద్రపరచడానికి హక్కుకు రూ.2 లక్షలు, స్వామివార్ల ఫొటోలు, చరిత్ర పుస్తకాలు విక్రయించేందుకు రూ 3 లక్షల 2 వేలకు టెండర్లు దాఖలయ్యాయి. మిగతా నాలుగు టెండర్లు సరైన పాటదారులు రాకపోవడంతో వాయిదా పడ్డాయి. గురువారం నిర్వహించిన టెండర్ల ద్వారా దేవస్థానానికి రూ.5 లక్షల 2 వేల ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు.

దాశరథి అగ్నిధార కళావేదిక ప్రారంభం

చిన్నగూడూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) చిన్నగూడూరు ఉన్నత పాఠశాలలో 1990-1991 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థులు రూ.80 వేల ఖర్చుతో నూతనంగా నిర్మించిన దాశరథి అగ్నిధార కళావేదికను గురువారం మండల విద్యాశాఖ అధికారి రవికుమార్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో యాకయ్యలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేదిక నిర్మాణానికి సహకారం అందించిన పూర్వ విద్యార్థులను అభినందించారు. పాఠశాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ పంజాల వీరన్న, కోట వెంకన్న, జక్కి నాగేశ్వర్, దోసపాట మల్లయ్య, మీర్జా మున్వర్ బేగ్, జంపాల యాకూబ్, గాడిపెల్లి నర్సయ్య, కోనం శ్రీను, ఎర్రోజు వెంకటేశ్వర్లు, బొల్లం రాము, మొగలగాని రామన్న, నరేందర్ పాల్గొన్నారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్నగౌడ్

● మానుకోట జిల్లా కేంద్రంలో విగ్రహం ఏర్పాటు ● రేపు అతిరథ మహారథులచే ఆవిష్కరణ
● ఏర్పాట్లు పూర్తి చేసిన విగ్రహ నిర్మాణకమిటీ ● పెద్ద సంఖ్యలో గౌడ కులస్థులు తరలిరావాలని విజ్ఞప్తి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 16న ఉదయం 10 గంటలకు బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ఆవిష్కరణ చేయనున్నారు. గౌడ కులస్థులు, సంఘాల బాధ్యులు కలిసి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ నిర్మాణ కమిటీగా ఏర్పడి, మానుకోట పట్టణంలోని కురవి రోడ్‌లో మహనీయుడు సర్వాయి పాపన్న విగ్రహాన్ని నెలకొల్పి ఆవిష్కరణకు సిద్ధం చేశారు. మహబూబాబాద్ జిల్లాలోని అన్ని మండలాల నుంచి గౌడ కులస్థులను భారీగా తరలించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శనివారం ఉదయం ఫాతిమా హైస్కూల్ నుంచి కురవి రోడ్‌లోని సర్వాయి పాపన్న విగ్రహం వరకు బైక్ ర్యాలీ చేపట్టనున్నారు. సామాజిక ఉద్యమ నేత, పోరాట యోధుడు పాపన్న చరిత్ర కనుమరుగు కాకుండా భావితరాలకు తెలియజేయాలనే సంకల్పంతో విగ్రహాన్ని నెలకొల్పామని, ఆవిష్కరణకు పెద్ద ఎత్తున తరలి వచ్చి జయప్రదం చేయాలని విగ్రహ నిర్మాణ కమిటీ బాధ్యులు విజ్ఞప్తి చేశారు.



మహబూబాబాద్-కురవి రోడ్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహం

ఖిలాషాపురంలో పుట్టిన పాపన్న..

జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం ఖిలాషాపురం గ్రామంలో సామాన్య గౌడ కుటుంబంలో నాసగోని ధర్మన్నగౌడ్-సర్వమ్మ దంపతులకు 1650 ఆగస్టు 18న సర్దార్ సర్వాయి పాపన్న జన్మించారు. తండ్రి చిన్నతనంలో చనిపోగా తల్లి కోరిక మేరకు కొంత కాలం గీత వృత్తిని ఎంచుకుని కల్లు గీశాడు. బాల్యంలో పశువులను కాస్తూ ఆనాటి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితులను గమనిస్తూ, తన స్నేహితులతో సమాలోచనలు చేస్తూ పరిస్థితులను అంచనా వేశారు. పదహారవ శతాబ్దంలో బహమనీ సుల్తాన్‌లు ఐదు చిన్న రాజ్యాలుగా విడిపోయింది. గోల్కొండ కోట కుతుబ్‌షాహి రాజవంశం చేతికి రాగా, నాడు ముస్లిం సైనికులు భూమి శిస్తు విధానంతో ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేసేవారు. గౌడ కులస్థుల వద్ద నుంచి కూడా తాటి చెట్లకు పన్ను వేసి వసూలు చేసే వారు. సర్వాయి పాపన్న వద్ద ముస్లిం సైనికులు కల్లుతాగి డబ్బులు ఇవ్వకుండా హేళనగా నవ్వుకుంటూ వెళ్లేవారు.

ఒకరోజు పాపన్న స్నేహితుడిపై తురుష్క సైనికులు దాడి చేసేందుకు ప్రయత్నించగా, వారిని ఎదిరించాడు. ఈక్రమంలో యువకులకు యుద్ధ విద్యలు నేర్పి స్థానిక జమీందార్లు, ఫౌజ్‌దార్లను తరిమికొట్టాడు. గోల్కొండ కోటను జయించి ఢిల్లీ చక్రవర్తి ఔరంగజేబు పాలనలో దక్షిణాదిన స్వతంత్ర రాజ్యాన్ని ఏర్పరుచుకుని తన సొంత గ్రామం ఖిలాషాపురాన్ని రాజధానిగా చేసుకుని ప్రజాపాలనను అందించిన బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న 30 ఏళ్ల పాటు పాలనను కొనసాగించారు. మొఘల్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడిన సర్దార్ సర్వాయి పాపన్న కుల మతాల అడ్డుగోడలను తొలగించి, ప్రజామోద పాలనతో సామాజిక నేతగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారు. పాపన్న రాజ్యంలో ప్రజామోద పనులు చేశారు. శత్రువు చేతిలో చావడం ఇష్టంలేని ఆయన తన బాకుతో గుండెల్లో పొడుచుకుని 1710లో కన్ను మూశాడు.

హాజరుకానున్న ప్రముఖులు

మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణకు అతిరథ మహారథులు హాజరుకానున్నారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, విశిష్ట అతిథులుగా మానుకోట శాసనసభ్యుడు భూక్య మురళీనాయక్, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మగాని మహేష్ కుమార్‌గౌడ్, డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రాంచందర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మానుకోట పార్లమెంటు సభ్యులు పోరిక బలరాంనాయక్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ. రమణ, తెలంగాణ గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణరావు, గోపా రాష్ట్ర అధ్యక్షుడు బండి సాయన్న, గీత పని వారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్, మోకు దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు అమరవేని నర్సగౌడ్ హాజరవుతున్నారని విగ్రహ నిర్మాణ కమిటీ బాధ్యులు తెలిపారు. పాపన్న విగ్రహావిష్కరణ అనంతరం అక్కడే సభ ఉంటుందని, గౌడ కులస్థులు, యువకులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ప్రగతి

డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

మరిపెడలో కాంగ్రెస్ శ్రేణులతో కలిసి శ్రమదానం

మరిపెడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతోనే సంపూర్ణ ప్రగతి సాధించొచ్చని డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ అన్నారు. గురువారం ఆయన స్థానిక కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్, మరిపెడ బస్టాండ్ ప్రాంగణంలో పిచ్చి మొక్కలు, చెత్త చెదారం తొలగించి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా రాంచంద్రునాయక్ జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ప్రతిజ్ఞ కాంగ్రెస్ కార్యకర్తలతో చేయించారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందచేసి ఆయన మాట్లాడారు. మన ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోనే సీజనల్ వ్యాధులకు చెక్ పెట్టొచ్చని అన్నారు. ఈ రెండ్రోజులు వర్షాలు విస్తృతంగా కురిసే అవకాశాలు ఉన్నందున కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరికైనా ఏ విపత్కర పరిస్థితులు ఏర్పడితే, అధికారులకు సమాచారం చేరవేస్తూ వారికి సహాయ పడాలని గుర్తుచేశారు. పీఎస్ గూడెం ఆకేరు సమీపంలోని గ్రామల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ ఉన్నందున ఆ కార్యక్రమానికి రావాలని అక్కడి ఆహ్వాన కమిటీ బాధ్యులు రాంచంద్రునాయక్ మరిపెడ విశ్రాంతి భవన్‌లో ఆహ్వాన పత్రిక అందచేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నేత వంటికొమ్ము యుగేంధర్‌రెడ్డి, కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్ ఐలిమల్లు, మరిపెడ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రఘువీర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, గంధసిరి అంబరీశ, విసారపు శ్రీపాల్‌రెడ్డి, కాలం రవీందర్‌రెడ్డి, రాంలాల్, అప్సర్, అజీజ్, వెంకటసాయి, గుండగాని వేణు, వెంకన్న, సురేశ్, రవికాంత్, బోడా రమేశ్, రవినాయక్, వెంకన్న పాల్గొన్నారు.



మరిపెడ బస్టాండ్ సెంటర్లో శ్రమదానం చేస్తున్న రాంచంద్రునాయక్

గవర్నర్ తేనేటి విందుకు సాంబశివరెడ్డికి ఆహ్వానం



మంగపేట, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర గవర్నర్ అధికారిక నివాసం రాజ్ భవన్‌లో ప్రముఖులతో శుక్రవారం నిర్వహిస్తున్న ఎట్ హోం కార్యక్రమంలో పాల్గొనేందుకు జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ కమిటీ సభ్యుడునాసిరెడ్డి సాంబశివరెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు గురువారం తనకు లేఖ అందిందని ఆయన తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సాయంత్రం 5 గంటలకు ప్రముఖులతో నిర్వహిస్తున్న ఎట్‌హోం కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో కలిసి పాల్గొననున్నట్టు పేర్కొన్నారు. తనకు ఈ అవకాశం రావడానికి కృషి చేసిన మంత్రి సీతక్క, ఎంపీ బలరాంనాయక్, కలెక్టర్ దివాకరకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వరద సహాయక చర్యలకు రూ.కోటి

అన్ని జిల్లాలకు కేటాయిస్తాం

వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

భూపాలపల్లి కలెక్టరేట్/ములుగు కలెక్టరేట్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వరద సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకూ రూ.కోటి చొప్పున విడుదల చేస్తున్నట్టు రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హైదారాబాద్ నుంచి సీఎస్ రామకృష్ణారావుతో కలిసి మంత్రి గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలపై సమీక్షించారు. భూపాలపల్లి కలెక్టరేట్ నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు కలెక్టరేట్ నుంచి కలెక్టర్ దివాకర పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఉద్యోగుల సెలవులు రద్దు చేసి, వెనక్కి పిలిపించాలన్నారు. వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లను ఆదేశించారు. వాతావరణశాఖ సూచనల ప్రకారం రాష్ట్రంలో అల్పపీడనం వల్ల కురిసే భారీ నుంచి అతి భారీ వర్షాల వల్ల ఎక్కడా ప్రాణ, ఆస్తినష్టం సంభవించకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలకు ముందస్తుగా రూ.కోటి చొప్పున నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని, అవసరమైతే మరిన్ని కేటాయిస్తామని తెలిపారు. వరదల వల్ల నష్టపోయిన ప్రజలకు పరిహారం అందించేందుకు ప్రతిపాదనలు పంపాలని అన్నారు. వరద సహాయక చర్యల్లో పోలీసు యంత్రాంగం సహకారం పూర్తిస్థాయిలో తీసుకోవాలని, రోడ్లు, కాజ్‌వేల డ్యామేజ్, విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ల డ్యామేజ్ ఉంటే వెంటనే మరమ్మతులు చేపట్టాలని అన్నారు. అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. వర్షాల నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలకు ఒక ప్రిన్సిపల్ కార్యదర్శిస్థాయి అధికారిని నియమించి పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. అనుకోని సంఘటనలు జరిగితే ఎస్డీఆర్ఎఫ్ బృందాల సేవలను వినియోగించుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, ములుగు అదనపు కలెక్టర్ సంపత్‌రావు, కాటారం సబ్‌కలెక్టర్ మయాంక్‌సింగ్, ములుగు ఇరిగేషన్ సీఈ కుమారస్వామి, జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్, వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్, డీఎంహెచ్‌వో గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
● కలెక్టర్, ఎస్పీతో కలిసి పోలీస్ సర్కిల్ కార్యాలయం ప్రారంభం



సీఐ కరుణాకర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే

గణపురం, ఆగస్టు 14(ఆంధ్రజ్యోతి): ప్రజల శాంతి భద్రతల పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలోని నూతన పోలీస్ సర్కిల్ కార్యాలయ ప్రారంభోత్సవానికి గురువారం ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరేతో కలిసి పాల్గొన్నారు. అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ కార్యాలయాన్ని ప్రారంభించారు. తొలి సీఐగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్‌రావును శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శాంతి భద్రతల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నూతన సర్కిల్ ఏర్పాటు సంతోషకరమైన విషయమని, దీంతో శాంతిభద్రతలు మరింత పటిష్టమవుతాయని అన్నారు. మండలంలో ఇప్పటికే కేటీపీపీ, సింగరేణి గనులు ఉన్నాయన్నారు. గాంధీనగర్ గుట్టలను సైతం పారిశ్రామిక కేంద్రాలుగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కోటగుళ్లు, రెడ్డిగుడి, గణపసముద్రంలో బోటింగ్, పాండవుల గుహలు, మైలారం సున్నపు గుహలు, బుగులోని వెంకటేశ్వర్లస్వామి ఆలయం, నాపాక ఆలయాలను అభివృద్ధి చేసి నియోజకవర్గాన్ని టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేష్, నరేష్, ఎస్సైలు అశోక్, అమూల్య, సందీప్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీవో భాస్కర్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొండాయి వాసులు అధైర్యపడొద్దు

అడిషనల్ కలెక్టర్ మహేందర్

ఏటూరునాగారం రూరల్, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి) : కొండాయి వాసులకు శాశ్వత నిర్మాణాల కోసం ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని, గ్రామస్థులు అధైర్యపడొద్దని అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ అన్నారు. ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని దొడ్ల, మల్యాల, కొండాయి తదితర గ్రామాల్లో ఆయన గురువారం పర్యటించారు. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జంపన్నవాగు ఉధృతంగా ప్రవహిస్తోందని అన్నారు. దీంతో జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన పడవలో ఎక్కి వాగు దాటి మల్యాల, కొండాయి గ్రామాలకు చేరుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులను గ్రామస్థులను అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా నివాసయోగ్యమైన స్థలాల్లో పక్కా ఇండ్ల నిర్మాణాలను చేపట్టేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అధికారులకు గ్రామస్థులు సహకరించాలని కోరారు. వర్షాలు కురుస్తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

అడ్డుకున్న దొడ్ల గ్రామస్థులు

తమ భూములను ఎవరికీ ఇవ్వొద్దని అడిషనల్ కలెక్టర్ మహేందర్‌ను దొడ్ల గ్రామస్థులు కోరారు. ఎన్నో ఏళ్ల క్రితం సాగుచేసుకున్న భూములను కొండాయి వాసులకు కేటాయించొద్దని ఆయన్ను అడ్డుకున్నారు. కొండాయి గ్రామానికి వస్తున్న క్రమంలో దొడ్ల గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి అడిషనల్ కలెక్టర్ వాహనాన్ని ఆపి నిరసన వ్యక్తం చేశారు. దీనిపై ఆయన మాట్లాడుతూ రెండు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రణాళికలు సిద్ధం చేస్తామని, గ్రామస్థులు అధైర్యపడొద్దని అన్నారు. ఆయన వెంట తహసీల్దార్ జగదీశ్వర్, తదితరులు ఉన్నారు.



జంపన్నవాగుపై పడవలో కొండాయికి వెళ్తున్న అడిషనల్ కలెక్టర్

బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బుద్ధి చెబుతాం

● బీజేపీ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి

కృష్ణకాలనీ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బుద్ధి చెబుతామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని బీఎంఎస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆదేశానుసారం 20 మందితో బీజేపీ పూర్తి కమిటీని ప్రకటించినట్టు చెప్పారు. ఆరుగురు ఉపాధ్యక్షులు, మరో ఆరుగురిని సభ్యులుగా నియమించినట్లు వివరించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతీ ఒక్కరు ఇంటిపైన జాతీయ జెండాను ఎగరవేయాలన్నారు. కొంత మంది బీజేపీ కార్యకర్తలమని చెప్పుకొని పాఠశాలలు, కళాశాలల్లో వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారికి పార్టీకి ఎలాంటి సంబంధం లేదని అన్నారు. బీజేపీలో అలా వసూళ్లు చేసే సంస్కృతి లేదని స్పష్టం చేశారు.

అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. సభ్యులుగా దాసరి తిరుపతి రెడ్డి, మోరే రవీందర్‌రెడ్డి, వేషాల సత్యవతి, కోడెపాక స్వరూప, సాలమ మధుసూదన్‌రెడ్డి, గొర్రె శశికుమార్ ప్రధాన కార్యదర్శులుగా దొంగల రాజేందర్, తాటికొండ రవికుమార్, పెండాల రాజ్‌కుమార్, జిల్లా కార్యదర్శులుగా మరో ఆరుగురిని ఎంపిక చేసినట్లు ప్రకటించిన ఆయన నూతన కమిటీకి ప్రత్యేక అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిశీధర్‌రెడ్డి

పీఏసీఎస్ పదవీకాలం పొడిగింపు



తొర్రూరు సొసైటీ కార్యాలయం

తొర్రూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక సహకార సంఘాల పదవీకాలాన్ని ప్రభుత్వం మరో ఆరు నెలలు పొడిగిస్తూ గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసింది. కో ఆపరేటివ్ సొసైటీ ప్రధాన కార్యదర్శి రఘునందన్ రావు, పీఏసీఎస్ పాలక వర్గాల పదవీకాలాన్ని 2026 ఫిబ్రవరి 16 వరకు పొడగిస్తూ జీవో నంబర్ 386 జారీ చేశారు. జిల్లాలో 19 పీఏసీఎస్ సహకార సంఘాలు ఉన్నాయి. సుమారు 1లక్ష మంది రైతులు సభ్యత్వాలు కలిగి ఉన్నారు. స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వం వీరి పదవీకాలాన్ని మరో సారి పొడిగించినట్లు తెలుస్తుంది.

వరంగల్ మార్కెట్ ధరలు
(రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7720	5300
మక్కలు	2112	1521
కందులు	5723	3022
పెసళ్లు	7022	3022
పల్లికాయ (సూక)	6200	3450
పల్లికాయ (పచ్చిది)	4900	1575
పసుపు (కాడి)	12003	9534
పసుపు (గోల)	10509	8700
తేజ మిర్చి	10000	8500
తేజ ఏసీ	14000	11500
వండర్‌హాట్	15000	6000
వండర్‌హాట్ ఏసీ	14500	11500
యూఎస్341ఏసీ	14300	7000
దీపిక	9000	8000
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

స్వాతంత్ర్యం.. మా జన్మహక్కని..

- స్వాతంత్ర్య పోరాటంలో గర్జించిన ఓరుగల్లు
- క్విట్ ఇండియా తొలి స్పందన ఇక్కడే
- ఖిలాఫత్ ఉద్యమంతో ప్రారంభం
- పూలపాడ్‌లో మద్య నిషేధానికి తొలి బీజం
- ఊరూరా చరఖా ఉద్యమం
- గాంధీజీ రాకతో కొత్త చైతన్యం
- సర్వస్వం త్యాగం చేసిన ఎందరో యోధులు
- 1920 -1948 మధ్య పోరాట ఘట్టాలెన్నో..

దేశమాత సంకెళ్లను తెంచడానికి భారత ప్రజలు నాడు జరిపిన పోరాటంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కూడా ప్రముఖ పాత్ర పోషించింది. అటు స్వాతంత్రోద్యమం, ఇటు హైదరాబాద్ రాష్ట్ర విమోచనోద్యమం... ఏక కాలంలో రెండు ఉద్యమాలను పటిష్ఠంగా నిర్వహించిన అపూర్వమైన, ఉద్విగ్నమైన ఉద్యమ చరిత్ర కలిగిన జిల్లా ఇది. దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో తమ ప్రాణాలను పణంగా పెట్టారు. జీవితాలను త్యాగం చేశారు. సత్యాగ్రహాలు చేశారు. జైళ్లకు వెళ్లారు. బ్రిటిష్‌వారిని దేశం నుంచి తరిమికొట్టేందుకు మహాత్మా గాంధీ ఇచ్చిన అన్ని పిలుపులను ప్రజలు అందిపుచ్చుకున్నారు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో ప్రధాన ఘట్టంగా నిలిచిన 1920 నాటి ఖిలాఫత్ ఉద్యమం నుంచి ప్రారంభమైన జిల్లా ప్రజల పోరాటం 1948 నిజాం ప్రభువును గద్దె దించే వరకూ కొనసాగింది. 79 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో సాగిన ప్రధాన ఘట్టాలను ఒకసారి అవలోకిద్దాం.

హనుమకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): 1920లో మహాత్మాగాంధీ స్ఫూర్తితో ప్రారంభమైన ఖిలాఫత్ ఉద్యమం దేశవ్యాప్తంగా ప్రజల్లో చైతన్యాన్ని రగిల్చింది. వరంగల్ జిల్లా ప్రజలు కూడా విదేశీ పాలనపై సమర శంఖం పూరించారు. అదే వరంగల్ జిల్లా స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న మొదటి ఘట్టం. ఖిలాఫత్ ఉద్యమం జిల్లాలో 1920 మార్చి, ఏప్రిల్ మాసాల్లో తీవ్ర స్థాయిలో జరిగింది. జనగామ ప్రాంతంలో పెద్ద ఎత్తున సాగింది. గాంధీజీ ఆశయాలైన ఖద్దర్ దుస్తుల వాడకం, మద్యపాన నిషేధానికి ఆయన పిలుపు మేరకు జిల్లా స్వాతంత్ర్య సమర యోధులు నలుమూలల ప్రచారం చేశారు.

ప్రజలంతా ఉద్యమంలో పెద్ద సంఖ్యలో పాల్గొనేలా దేశభక్తి భావనను వ్యాప్తి చేశారు. ఆచరణలో ఆయా కార్యక్రమాలను సఫలం చేసేందుకు స్వదేశీ ఉద్యమానికి ఊపునిచ్చేందుకు వరంగల్ ఖద్దర్ నూలు వడికే చరఖాలను తయారు చేసే ఖార్ఖానాలను స్థాపించారు. వాటిని జిల్లాలోని మారుమూల పల్లెలకు సైతం పంపిణీ అయ్యేలా చూశారు. మద్యపాన వ్యతిరేక ప్రచారంలో భాగంగా పూల్‌పాడ్ గ్రామంలో వందలాది మంది ప్రజలు తాము మద్యం ముట్టబోమని ప్రమాణం చేశారు. ఆ విధంగా స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా మద్యపాన నిషేధ కార్యక్రమానికి ఆ రోజుల్లోనే వరంగల్ జిల్లాలో బీజం పడింది. ప్రజల్లో చైతన్యం వెల్లివిరుస్తుంటే మరో వైపు హైదరాబాద్ నిజాం రాజు బెంబేలెత్తిపోయాడు. అందువల్ల స్వాతంత్రోద్యమ పోరాటాన్ని అణచివేయడానికి పూనుకున్నాడు. స్వాతంత్ర్య పోరాట యోధులపై అనేక ఆంక్షలు విధించాడు. అడుగడుగునా నిర్బంధాలు సృష్టించాడు.



ఆంధ్రజన సంఘం సభ

1920 దశకంలో స్వాతంత్ర్యోద్యమ జ్వాలలు దేశంలో బలీయంగా వీస్తున్న తరుణంలో నిజాం రాజ్యంలోని తెలంగాణ ప్రాంతంలో నిజాం రాష్ట్ర అంధ్రజన సంఘం, ఆంధ్ర జన కేంద్ర సంఘం ఏర్పడి ప్రజల్లో విద్యా వికాసానికి కృషి చేస్తుండేవి. 1924 ఏప్రిల్ 1న ఆంధ్రజన సంఘం హనుమకొండలో మొట్టమొదటి సమావేశాన్ని నిర్వహించింది. ఆంధ్రజన సంఘానికి బలీయమైన రాజకీయ ఉద్దేశాలు లేకపోయినా నిజాం నిరంకుశ పాలనను ఎదిరించే దిశగా ప్రజలను విద్యావంతులను చేయడమే లక్ష్యంగా ఈ సమావేశం జరిగింది. నాడు ఈ సమావేశంలో పాల్గొన్న పెద్దలు స్వాతంత్ర్య పోరాటాన్ని ఉధృతం చేయాల్సిన అవసరాన్ని ప్రజలకు తెలియజేశారు. వారిని మరింత ఉత్తేజితులను చేశారు.

స్వదేశీ ఉద్యమం

1933లో స్వదేశీ ఉద్యమాన్ని విజయవంతం చేసే దిశగా వరంగల్ ఒక్కుమ్మడిగా ముందుకు కదలింది. స్వదేశీ ఉద్యమాన్ని పట్టణ, గ్రామ ప్రాంతాల్లో ప్రచారం చేశారు. ముఖ్యంగా చరఖాలను హైదరాబాద్ నుంచి తెప్పించి శిక్షణ ఇప్పించారు. స్వదేశీ పత్రికల ముద్రణ, స్వదేశీ పుస్తక విక్రయశాలలను నెలకొల్పారు. ప్రజలకు చౌకగా పుస్తకాలను విక్రయించడం, ఖాదీధారణ, ప్రచారం మొదలైనవాటిని చేపట్టారు. ఎంఎస్ రాజలింగం, బండారు వీరమల్లు ప్రసాద్, ఏటూరి వెంకటేశ్వర్‌రావు మొదలైనవారు 1932 నుంచి వరంగల్‌లో ఖాదీ ప్రచారాన్ని ఒక ఉద్యమంలా సాగించారు. ఎంఎస్ రాజలింగం స్వయంగా శిక్షణ పొందడానికి 1941లో గాంధీజీ సేవా గ్రామ్‌లో చేరారు. రామా చంద్రమౌళి, రంగనాయకులు, దుగ్గిశెట్టి వెంకటయ్య, గొడిశాల శంకరయ్య, మద్ది జనార్దన్, కొమరగిరి నారాయణ మొదలైనవారు ఊరూరా తిరిగి ఖాదీని స్వదేశీ భావాలను ప్రచారం చేశారు.

ఆంధ్ర మహాసభలు

స్వాతంత్ర్య పోరాటాన్ని నిర్వహిస్తున్న సంస్థల మధ్య అభిప్రాయ భేదాలు తలెత్తుతున్న తరుణంలో వరంగల్ జిల్లా నాయకులు మౌలికమైన నిర్ణయాలు తీసుకునేందుకు తొమ్మిదో మహాసభను 1942లో వరంగల్ జిల్లా ధర్మారం గ్రామంలో నిర్వహించారు. అంతకు ముందు ఏడో సదస్సును వరంగల్ జిల్లాలోని ధర్మసాగర్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో నిర్వహించారు. స్వాతంత్య పోరాటంలో ప్రజలను మరింత భాగస్వాములను చేయడానికి ఆంధ్ర సారస్వత పరిషత్ మహాసభలను వరంగల్ కోటలో నిర్వహించారు.

జాయిన్ ఇండియా

రామానందతీర్థ ఇచ్చిన జాయిన్ ఇండియన్ యూనియన్ అన్న పిలుపు మేరకు 1947 ఆగస్టు 7 నుంచి వరంగల్ జిల్లాలో హర్తాళ్లు, పాఠశాలల బహిష్కరణ వంటి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించారు. మల్కాపూర్‌లో నిర్వహించిన ఆంధ్ర మహాసభల తర్వాత ఉద్యమం నుంచి కమ్యూనిస్టులు వేరయ్యారు. తత్ఫలితంగా ఆంధ్ర జాతీయ పక్షం నిర్మాణమైంది. బూర్గుల రామకృష్ణారావు, కుందుముల నర్సింహారావు, జమలాపురం కేశవరావు, కొండా వెంకటర రంగారెడ్డి, గెల్ల కేశవరావు, మాడపాటి హనుమంతరావు, పీవీ నరసింహారావు, టి.హయగ్రీవాచారి తెలంగాణ అంతటికి ఉద్యమ సారథులుగా నిలిచారు. ఎట్టకేలకు 1947 ఆగస్టు 15న భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించింది. దేశ ప్రజలంతా స్వేచ్ఛా వాయువులను పీలుస్తుండగా నిజాం ప్రభుత్వ పరిధిలోని తెలంగాణ ప్రాంత ప్రజలకు మాత్రం ఆ ఆనందం దక్కలేదు. ఆ తర్వాత జరిగిన నిజాం వ్యతిరేక పోరాటంలో కూడా వరంగల్ ప్రజలు వీరోచితంగా పాల్గొన్నారు. 1948 సెప్టెంబర్ 17న పోలీసు చర్యతో అసలైన స్వేచ్ఛా ఫలాన్ని ఆస్వాదించారు.

గాంధీజీ రాక

1945 ఫిబ్రవరి 5న గాంధీజీ వరంగల్‌కు వచ్చారు. వరంగల్ ప్రతినిధిగా వెళ్లిన బండారు చంద్రమౌళీశ్వరరావు గాంధీజీ వరంగల్ సందర్శన కార్యక్రమాన్ని నిర్ణయించుకొని వచ్చారు. గాంధీజీ వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగారు. స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ ఘట్టం వరంగల్ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగింది. తండోపతండాలుగా వచ్చిన ప్రజలు, నాయకులు అక్కడికక్కడే రూ. 12వేలను సమీకరించి స్వాతంత్రోద్యమ నిధిగా బాపూజీకి సమర్పించారు.

క్విట్ ఇండియా ఉద్యమంలో..

1942లోనే మహాత్మాగాంధీ పిలుపునిచ్చిన క్విట్ ఇండియా ఉద్యమానికి వరంగల్ జిల్లాయే ప్రప్రథమంగా స్పందించింది. క్విట్ ఇండియా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న ఎంఎస్ రాజలింగం, శ్రీరాం చంద్రమౌళి, దుగ్గిశెట్టి వెంకటయ్య, ఆరెల్లి బుచ్చయ్య, బొలుగొడ్డు రంగనాయకులు, గొడిశాల కొమురయ్య, ఎలగందుల వైకుంఠం తదితర నాయకులను నిజాం ప్రభుత్వం 1942 అక్టోబర్ 8న అరెస్టు చేసి జైల్లో పెట్టింది. ఆ కాలంలోనే మహాత్మాగాంధీ ఓరుగల్లు గడ్డపై అడుగుమోపారు.

సత్యాగ్రహాలు

1938లో హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్‌ను ప్రారంభించినప్పుడు నిజాం ప్రభుత్వం దానిని నిషేధించింది. ప్రభుత్వ నిరంకుశ ధోరణులను ఎండగడుతూ వరంగల్ నుంచి తిరువరంగం హయగ్రీవాచారి, ఇటికాల మధుసూదన్‌రావు, పొట్లపల్లి రామారావు, బొలుగొడ్డు రంగనాయకులు వంటి పలువురు స్వాతంత్ర్య సమరయోధులు సత్యాగ్రహంలో పాల్గొని జైలుపాలయ్యారు. నిజాం ప్రభుత్వం హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్‌పై నిషేధం ఎత్తివేయకపోవడంతో జిల్లా నాయకులు ప్రత్యామ్నాయంగా ఆర్య సమాజాన్ని వేదికగా ఎంచుకున్నారు.

జ్ఞాపకాలు తప్ప, స్మృతి చిహ్నాలేవి?

- పదిల పరచడంలో నిర్లక్ష్యం
- స్వాతంత్ర్య పోరాట ఘట్టాలను రికార్డు చేయడంలో అలసత్వం



వరంగల్ కోటలో శిథిలావస్థలో ఉన్న మొగిలయ్య ఇల్లు

హనుమకొండ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఉమ్మడి వరంగల్ జిల్లా నిర్వహించిన పాత్ర ఎనలేనిది. స్వాతంత్ర్యం కోసం సమరయోధులు తమ సర్వస్వాన్ని ధారపోశారు. అనేక మంది జైళ్లకు వెళ్లారు. రజాకార్ల చేతుల్లో కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో చరిత్ర పుటల్లో నిలిచిపోయే అనేక పోరాట ఘట్టాలు చోటు చేసుకున్నాయి. కానీ అవన్నీ ఇప్పుడు కేవలం జ్ఞాపకాలుగానే మిగిలిపోయాయి. నాటి చారిత్రక ఘట్టాల స్మృతి చిహ్నాలు ఏ మాత్రం కనిపించడం లేదు. పాలకులు వాటిని సరైన రీతిలో పరిరక్షించకపోవడంతో క్రమంగా కనుమరుగై పోయాయి. జాతిని జాగృతం చేసే గత చరిత్రను రికార్డు చేసే ప్రయత్నం ఏదీ ఉమ్మడి జిల్లాలో ఇప్పటి వరకు జరగలేదు. ఆ దిశగా కనీసం ప్రయత్నాలు ప్రభుత్వం, జిల్లా పాలనా యంత్రాంగమూ చేయలేదు.

మొగిలయ్య హాల్..

ఒకప్పుడు స్వాతంత్ర్య సమర పోరాటానికి కేంద్రంగా, స్వాతంత్ర్య సమరయోధులకు ఒక వేదికగా నిలిచిన వరంగల్ జేపీఎన్ రోడ్డులోని మొగిలయ్య హాల్ (స్మారక భవనం) క్రమంగా తన ఉనికిని కోల్పోతోంది. 1946లో వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఎగుర వేసినందుకు రజాకార్లు జరిపిన దాడిలో హత్యకు గురైన బత్తిని మొగిలయ్య గౌడ్ స్మృత్యర్థం నిర్మించిన ఈ స్మారక మందిరంలో ఆనాటి స్వాతంత్ర్య సమరయోధులు తరచూ సమావేశమయ్యేవారు. ఇందులో ఒక గ్రంథాలయాన్ని కూడా నిర్వహించేవారు. జాతీయ భావనల ఉద్దీపన కేంద్రంగా ఈ మందిరం విరాజిల్లింది. కానీ అది ఇప్పుడు అద్దెల ద్వారా ఆదాయం సమకూర్చిపెట్టే పక్కా కమర్షియల్ కాంప్లెక్స్‌గామారిపోయింది. అలాగే వరంగల్ కోటలో రజాకార్ల చేతిలో మొగిలయ్యగౌడ్ హత్యకు గురైన ప్రాంతాన్ని కూడా స్మారక ప్రదేశంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అభివృద్ధి చేయలేదు. జాతీయ జెండా ఎగురవేసిన ప్రాంతాన్ని, మొగిలియ్య ఇంటిని సైతం పట్టించుకోలేదు. ఈ ఇల్లు క్రమంగా శిథిలావస్థకు చేరుకుంటోంది.

యోధుల జాడలేవీ?

నాటి స్వాతంత్ర్యం పోరాటంలో పాల్గొన్న యోధులు ఎవరో ఈ తరం తెలుసుకునే సమాచారం ఏదీ ప్రస్తుతం అందుబాటులో లేదు. వారి జీవిత చరిత్రలు గానీ, ఫొటోలు గానీ ఎక్కడా కనిపించడం లేదు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న వరంగల్ నగరానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుల పేర్లు చెక్కిన రెండు శిలాఫలకాలను హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో ప్రతిష్ఠించడం మినహా అంతకు మించిన చర్యలేవి తీసుకోలేదు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో దేశ స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న సమరయోధులు అనేక మంది ఉన్నారు. వారి పేర్లను కూడా సేకరించి ఒక స్మృతి చిహ్నాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది.



హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లో మసక బారుతున్న స్వాతంత్ర్య సమరయోధుల పేర్లున్న శిలాఫలకం

ఓపెన్ ఎయిర్ థియేటర్

ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు జమలాపురం కేశవరావు స్మారకార్థం హనుమకొండ బాలసముద్రంలోని ఆడిటోరియం కట్టాలన్న స్వాతంత్ర్య సమరయోధుల అభ్యర్థన అమలుకు నోచుకోలేదు. సమరయోధులు చాలాకాలం ఈ విషయంపై జిల్లా యంత్రాంగానికి వినతులు సమర్పించారు. ఈ పార్క్‌లో గతంలో ఒక ఓపెన్ ఎయిర్ థియేటర్ ఉండేది. అక్కడే అన్ని హంగులతో ఆడిటోరియం నిర్మించాలన్న ప్రతిపాదన కాగితాలకే పరిమితమయ్యింది. ఈ స్థలంలో ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్ వెలిసింది.

గాంధీ పర్యటన చిహ్నాలేవీ?

వరంగల్‌లో మహాత్మాగాంధీ రాకకు సంబంధించిన ఒక్క స్మృతి చిహ్నం కూడా లేదు. 1945 ఫిబ్రవరి 5న గాంధీజీ వరంగల్‌కు వచ్చారు. గాంధీజీ వరంగల్ రైల్వేస్టేషన్‌లో దిగారు. స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన వేదికపై నుంచి ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ చారిత్రక ఘట్టం చోటు చేసుకున్న వరంగల్ రైల్వే స్టేషన్‌లో అందుకు సంబంధించిన స్మృతి చిహ్నాలు భద్రపరచలేదు.

పెన్సిల్ మొనపై జాతీయ జెండా



కాటారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): ఓ ఉపాధ్యాయుడు తన సూక్ష్మ చిత్రకళా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. పెన్సిల్ మొనతో జాతీయ జెండాను చెక్కాడు. భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయానికి చెందిన ఆర్ట్ టీచర్ రజనీకాంత్ 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దేశ సమగ్రత, భక్తిని చాటే జాతీయ పతాకంతో శుభాకాంక్షలను తెలిపేలా చిత్రాలను పెన్సిల్ గ్రాఫైట్ మొనపై, చాక్‌పీస్‌లపై తయారు చేశాడు. పెన్సిల్ మొనపై 4మి.మీ ఎత్తు, 2మి.మీ వెడల్పు గల జాతీయ జెండాను చెక్కాడు. చాక్‌పీస్‌లపై సైతం 7మి.మీ ఎత్తు, 5మి.మీ వెడల్పుగల త్రివర్ణ పతాకాలను స్కల్ప్చరింగ్, మైక్రో ఆర్ట్ ద్వారా తయారు చేశాడు.

రారా కృష్ణయ్య..

- రేపే శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం
- ఉత్సాహపూరితంగా సాగనున్న ఉట్టి కొట్టే వేడుకలు
- అన్న, వస్త్రదానం చేస్తే ఎంతో పుణ్యమని నమ్మకం



శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో చిన్నారులు (ఫైల్)

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు నిర్వహించుకునేందుకు యాదవ కులస్థులు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పట్టణాలు, గ్రామాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూ పంచాంగం ప్రకారం ప్రతీ ఏడాది శ్రావణమాసం కృష్ణపక్షంలో వచ్చే అష్టమి తిథినాడు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను జరుపుకుంటారు. ఈ పవిత్రమైన రోజున యువత ప్రపంచ వ్యాప్తంగా శ్రీకృష్ణ జన్మాష్టమి, గోకులాష్టమి వేడుకలను ఆనందోత్సవాల నడుమ జరుకుంటారు. శ్రీకృష్ణాష్టమి రోజున చిన్నారులను శ్రీకృష్ణుని వేషధారణలో తయారు చేసి, పూజిస్తారు. ఈ వ్రతాన్ని ఆచరించిన వారికి కోరిన కోరికలు నెరవేరుతాయని ప్రతీతి. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఈనెల 16న శనివారం జరుపుకునేందుకు ప్రజలంతా సన్నద్ధమయ్యారు.

అష్ట ఘడియలు

ఆగస్టు 16 శనివారం ఉదయం 6 గంటల అష్టమి గడియలు ప్రారంభమై 7.30 అష్టమి ఘడియలు ప్రారంభమై ఉదయం 9 గంటలకు అష్టమి ఘడియలు ముగియనున్నాయి. ఉదయం 9 గంటల తర్వాత మంచిఘడియలు ఉన్నాయని వేద పండితులు పేర్కొన్నారు.

యాదవుల ప్రత్యేకం..

యాదవ కులస్థులు కృష్ణుడిని కులదైవంగా కొలుస్తారు. కృష్ణాష్టమి రోజున ప్రత్యేక పూజలు చేసి గ్రామాలు, పట్టణాల్లో వేడుకలు జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కృష్ణాష్టమి రోజున ఊయలలో కృష్ణుడి ప్రతిమలను ఉంచి కన్నులపండువగా జన్మదిన వేడుకలు నిర్వహిస్తారు. తమ చిన్నారులను కృష్ణుడు, గోపికల వేషధారణలతో అందంగా ముస్తాబుచేస్తారు. కృష్ణుడి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ముగింపు ఘట్టంగా నిర్వహించి సహపంక్తి భోజనాలతో వేడుకలు ముగిస్తారు. ఉట్టి కొట్టే కార్యక్రమం అందరు కలిసి పాలొనడం వారిలోని ఐక్యతను పెంచుతోంది. ఈ వేడుకల్లో యాదవులతో పాటు ఇతర కులస్థులు సైతం పాల్గొని, పండుగను ఘనంగా జరుపుకుంటారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి రహస్యం

భాగవతం ప్రకారం పరమ రాక్షసుడైన కంసుని చెల్లెలు దేవకి తనకి ఆమె అంటే ఎంతో ఇష్టం. తనకు వసుదేవుడితో వివాహం జరిపించి, అత్తారింటికి పంపే సమయంలో ఆకాశవాణి తన చెల్లెలు కడుపులో 8వ సంతానంగా పుట్టిన కుమారుడు కంసుడుని అంతమొందిస్తాడని చెబుతుంది. దీంతో ఆగ్రహానికి గురైన కంసుడు తన చెల్లెలు దేవకి బావ వసుదేవులను కర్మాగారంలో బంధిస్తాడు. వారికి పుట్టిన బిడ్డలని పురిట్లోనే చంపేస్తుంటాడు. ఏడుగురు చిన్నారులను కోల్పోయిన దేవకి ఎనిమిదవ గర్భం దాలుస్తుంది. ఆ బిడ్డ తనఅంతు చూస్తాడని కంసుడుకి ముందే తెలుసు. కాబట్టి కారాగారం వద్ద భద్రతను మరింత పెంచుతాడు. అయితే నెలలు నిండిన దేవకి శ్రావణమాసంలో బహుళఅష్టమి రోహిణి నక్షత్రం వేళ అర్ధరాత్రి శ్రీకృష్ణుడు జన్మించాడు. ఆ రోజును శ్రీకృష్ణాష్టమి, జన్మాష్టమి, గోకులాష్టమి, అష్టమి రోహిణి అని కూడా పిలుస్తారు.

ఏ వస్తువులు దానం చేయాలంటే..

శ్రీకృష్ణాష్టమి పర్వదినాన వైదిక క్యాలెండర్ ప్రకారం శ్రావణమాసం కృష్ణపక్షంలోని అష్టమి తిథి రోజున ఆకలితో ఉన్న వారికి అన్నదానం చేయడం ద్వారా కుటుంబంలో ఆహార సమస్యలేకుండా ఉండేందుకు ఉపయోగపడుతుంది. వెన్నదానం చేయం వలన దోషాలు తొలగిపోయి కుటుంబంలో శాంతి, సంతోషాలు నెలకొంటాయి. వస్త్రదానం చేయడం ద్వారా దుఃఖం, పేదరికం నుంచి ఉపశమనం పొందుతారు. నెమలి ఈకలు దానం చేయడం చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయి వృత్తి, వ్యాపారంలో పురోగతి ఉంటుంది.

సాంకేతిక సంబురాలకు సన్నద్ధం

- కేయూలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ పండుగ
- ఈ నెల 19 నుంచి 21 వరకు నిర్వహణ



సైన్స్ కాంగ్రెస్ ఏర్పాట్లపై సమీక్షలో పాల్గొన వీసీ ప్రతాప్‌రెడ్డి

కేయూ క్యాంపస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలకు కేయూ సన్నద్ధమవుతోంది. ఈనెల 19, 20, 21 తేదీల్లో మూడు రోజుల పాటు ప్రతిష్ఠాత్మకంగా తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహించనున్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న కీలక మార్పులపై సదస్సులో దిశానిర్దేశం చేయనున్నారు. 2018లో వరంగల్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ మొదటి సదస్సు జరిగింది. రెండో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ నిర్వహణ తాజాగా కేయూకు దక్కింది. మూడు రోజుల పాటు జరిగే సదస్సులకు ప్రఖ్యాతి గాంచిన శాస్త్రవేత్తలు హాజరు కానున్నారు. విద్యార్థులు, యువ పరిశోధకులకు సాంకేతిక రంగంలో చోటు చేసుకున్న అభివృద్ధిపై చక్కని సమాలోచనలు చేస్తారు. కేయూ, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్స్ సంయుక్తంగా తెలంగాణ సైన్స్ కాంగ్రెస్ సంబురాలను నిర్వహిస్తోంది. ఈ దఫా 'సాధికారత కోసం వినూత్న నైపుణ్యాలు, శాస్త్ర సాంకేతికతో యువ భారతాన్ని రూపాంతరం చెందేలా తోడ్పాటును అందించడం' అనే నినాదాన్ని థీమ్‌గా తీసుకున్నారు. సైన్స్ టెక్నాలజీలో విజ్ఞాన మార్పిడి, నూతన ఆవిష్కరణలపై మూడు రోజుల పాటు మేధోమథనం చేపడుతారు. ఆగస్టు 19న కేయూ స్వర్ణోత్సవ సంబురాల్లోకి అడుగిడుతున్న శుభ సందర్భంలో తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు.

5 కీలక ప్లీనరీలు

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌ను కీలకమైన 5 ప్లీనరీలను కేయూ ఆడిటోరియం వేదికగా నిర్వహిస్తారు. ప్రముఖ శాస్త్రవేత్తలు, దేశంలో పేరెన్నికగల పరిశోధన సంస్థల డైరెక్టర్లు హాజరై శాస్త్ర, సాంకేతిక రంగాల అభివృద్ధి, భవిష్యత్ పరిశోధనలపై దిశానిర్దేశం చేస్తారు. హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యూలార్ మాలిక్యూలర్ బయోలజీ (సీసీఎంబీ) డైరెక్టర్ డాక్టర్ కె.వినయ్ కుమార్ నందికూరి, బెంగళూరులోని ఎల్ఆర్‌డీఈ (డీఆర్‌డీఏ) డైరెక్టర్ జి.విశ్వం, ఢిల్లీ, కేరళ త్రివేంద్రంలోని డీఆర్‌డీఏ డైరెక్టర్ మార్త ఎన్‌రెడ్డి, ఎన్‌వీ చలపతి, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ ఎన్.రఘురాం హాజరై కీలక ప్రసంగిస్తారు. వీరితో పాటు ఫిజికల్ సైన్స్, మ్యాథ్స్, ఇంజినీరింగ్, లైఫ్ సైన్సెస్, ఫార్మసీ, కెమిస్ట్రీ, జియాలజీ విభాగాల్లో నిష్ణాతులైన డాక్టర్ వాసు సింగూరి, ప్రొఫెసర్ జ్ఞానేశ్వర్, వరంగల్ నిట్ డైరెక్టర్ విద్యాధర్ సుబుధి, డీఎన్ రామకృష్ణ, ప్రొఫెసర్ మోరె రాములు, ప్రొఫెసర్ కె.రాజిరెడ్డి, ప్రొఫెసర్ డి.సాంబరెడ్డి, ఏఆర్‌సీ రెడ్డిలు హాజరుకానున్నారు.

సీనియర్ సైంటిస్టుల అనుభవాలను పంచుకునేందుకు సైన్స్ కాంగ్రెస్‌లో ఏర్పాట్లు చేశారు. ఢిల్లీ, బెంగళూరు, హైదరాబాద్‌లతో పాటు జాతీయ స్థాయిలో ఖ్యాతిగాంచిన డాక్టర్ సీహెచ్. మోహన్‌రావు, డాక్టర్ వెంకటేశ్వరన్, డాక్టర్ ఈశ్వర్ ప్రసాద్‌తో ప్రత్యేక స్టూడెంట్స్ ఇంట్రాక్షన్ కార్యక్రమాన్ని రూపొందించారు. అంతరిక్ష పరిశోధనపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. కేరళ త్రివేండ్రం, విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ డైరెక్టర్లు సిచాయ్ మణి, డాక్టర్ కె.కిశోర్ కుమార్‌తో ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. సాంకేతిక రంగంలో భాగమైన ఆర్కిటెక్చర్‌తో పాటు హెరిటేజ్ రంగాలపై వరంగల్ నిట్ రిటైర్డు ప్రొఫెసర్ ఎం.పాండురంగారావు ప్రత్యేక సదస్సులు నిర్వహిస్తారు. హైదరాబాద్‌లోని ఐఐటీసీ చీఫ్ సైంటిస్టు సుంకర మనోరమ, హైదరాబాద్ ఆర్‌సీఐ డీఆర్‌డీవో చీఫ్ సైంటిస్టు వెంకటమణిలతో పాటు ఇతర మహిళా సైంటిస్టుల ప్రసంగిస్తారు. ఏఐ రంగంలో పేరొందిన ఐఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్ టి.కృష్ణారెడ్డి, హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ ప్రొఫెసర్ పద్మనాభన్ నాయర్‌లతో సదస్సులు నిర్వహిస్తారు. వీరితో పాటు కెమిస్ట్రీ, జియాలజీ రంగంలో ప్రఖ్యాతి గాంచిన పూణె ఎన్ఆర్‌సీ సైంటిస్టు ప్రొఫెసర్ కొతం రవీందర్, నాగపూర్‌లోని జియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డైరెక్టర్ శేషసాయి, ఎన్‌జీఆర్ఎఫ్ ప్రొఫెసర్ పాండేలు హాజరుకానున్నారు.

750 రిసెర్చ్ అబ్‌స్ట్రాక్టులు.. 596 రిజిస్ట్రేషన్లు..

తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌కు 750 మంది శాస్త్ర, సాంకేతిక అంశాలపై రీసెర్చ్ అబ్‌స్ట్రాక్టులు సమర్పించారు. అలాగే 596 మంది సదస్సుకు హాజరయ్యేందుకు ఆసక్తితో రిజిస్ట్రేషన్లు చేసుకున్నారు. మొత్తంగా 1346 మంది ప్రతినిధులు హాజరుకానున్నారు. వీరితో పాటు వర్సిటీ ప్రొఫెసర్లు, అధ్యాపకులు, స్కాలర్లు, విద్యార్థులు పాల్గొననున్నారు.

హైస్కూల్ విద్యార్థులకు అవకాశం

సాంకేతిక రంగాన్ని బలోపేతం చేసి యువతను ప్రోత్సహించేందుకు 9,10 తరగతుల స్కూల్ విద్యార్థులు, స్కూల్ సైన్స్ ఉపాధ్యాయులకు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో అవకాశం కల్పించారు. వరంగల్ నిట్ ప్రొఫెసర్లు, జన విజ్ఞాన వేదిక బాధ్యులు ప్రొఫెసర్ రామచంద్రయ్య, ప్రొఫెసర్ లక్ష్మారెడ్డి, మాజీ వీసీ ప్రొఫెసర్ ఎస్.సత్యనారాయణల నేతృత్వంలో విద్యార్థులతో శాస్త్ర సాంకేతిక అంశాలపై సరైన అవగాహన కల్పిస్తారు. దాదాపు 200 మంది విద్యార్థులకు తెలంగాణ సైన్స్ కాంగ్రెస్‌లో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు. ఆగస్టు 19న మధ్యాహ్నం విద్యార్థులు, ఆగస్టు 20న ఉపాధ్యాయులు పాల్గొనేందుకు అవకాశం ఉంది. 'అభివృద్ధి నిర్మాతలు - వికసిత్ భారతం కోసం యువత శాస్త్ర సాంకేతిక ఆవిష్కరణలు' అనే అంశంపై కేయూ ప్రొఫెసర్ సదానందం పర్యవేక్షణలో 12 మంది అనుభవజ్ఞులైన పేరుగాంచిన శాస్త్రవేత్తలో ప్యానల్ డిష్కషన్ నిర్వహిస్తారు. క్యాంపస్‌లోని ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, జువాలజీ, కామర్స్, ఫార్మసీ కళాశాలల్లోని సెమినార్ హాల్‌లలో 7 చోట్ల ఒకే దఫా టెక్నికల్ సెషన్లు నిర్వహిస్తారు. దీనికి సంబంధించిన కీలక ఏర్పాట్లను పూర్తి చేశారు.

కేయూ దిక్సూచి.. 'వివేచన'

- 2006 నుంచి ఏటేటా రెండు ఎడిషన్లు ప్రచురణ
- వర్సిటీ అభివృద్ధిపై కీలక డాక్యుమెంట్

కేయూ క్యాంపస్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): కేయూ ప్రతిష్ఠకు నిలువెత్తు నిదర్శనంగా కాకతీయ వివేచన న్యూస్‌లెటర్ నిలుస్తోంది. యేటా జనవరి 26, ఆగస్టు 15న రెండు ఎడిషన్లను ప్రచురిస్తారు. వర్సిటీ అభివృద్ధి, అకడమిక్ అచీవ్‌మెంట్స్‌తో పాటు డాక్టరేట్ సాధించిన అభ్యర్థుల వివరాలను ప్రచురిస్తారు. 2006లో అప్పటి వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.గోపాల్‌రెడ్డి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జగన్నాథస్వామిల చొరవతో వర్సిటీ పురోభివృద్ధిపై ఏటేటా రెండు సంచికలను తీసుకురావాలనే ఆలోచన పురుడు పోసుకుంది. ఏడాదిలో రెండు విడతలుగా జనవరి, ఆగస్టు మాసంలో సాధించిన అచీవ్‌మెంట్‌పై చక్కని సమాచారాన్ని పుస్తకంగా ప్రచురిస్తున్నారు.

రెండు ఎడిషన్లు

కేయూ సమగ్ర సమాచారదర్శిని కాకతీయ వివేచన న్యూస్ లెటర్ ప్రతీ ఏడాదికి రెండు సంచికలు ప్రచురిస్తారు. జనవరి నుంచి ఆగస్టు 15 వరకు వర్సిటీలో జరిగే ప్రతీ ఈవెంట్‌తో పాటు ముఖ్యమైన సమాచారాన్ని సంక్షిప్తంగా న్యూస్‌లెటర్‌లో ప్రచురిస్తారు. అకడమిక్ ఈవెంట్లు, ఎంఓయూలు, ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీస్, విజిటర్స్, అదర్ ఈవెంట్స్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్, అవార్డు అండ్ అచీవ్‌మెంట్స్, స్పోర్ట్స్ అండ్ కల్చర్, ఎండోమెంట్ లెక్చర్స్, ఇంటర్నేషనల్ ఈవెంట్స్, సెమినార్స్, డెవలప్‌మెంట్ యాక్టివిటీస్, టీచింగ్, నాన్ టీచింగ్ ఉద్యోగులతో పాటు స్కాలర్స్, అధ్యాపకులు సాధించిన పురస్కారాలు, అవార్డులు, రివార్డులను ప్రచురిస్తారు. వీటితో పాటు పీహెచ్‌డీ డాక్టరేట్ సాధించిన అభ్యర్థుల వివరాలు, విభాగాలు, గైడ్‌ల సమాచారాన్ని అందిస్తారు.

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో అందుబాటులోకి..

వర్సిటీలో ఏటా రెండు సంచికలను ఆఫ్‌లైన్‌లో ప్రచురించి అన్ని విభాగాలతో పాటు కార్యాలయాలకు అందచేస్తారు. అలాగే ఆన్‌లైన్‌లోనూ అందుబాటులో ఉంచుతారు. ఎవ్వరికీ ఎప్పుడు ఏ సమాచారం కావాలన్నా నేరుగా వర్సిటీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి వారికి కావాల్సిన సంచికను అప్పటికప్పుడూ చూసుకునే సదుపాయం ఉంది.

ఎడిటోరియల్ బోర్డు ఏర్పాటు

కాకతీయ యూనివర్సిటీ న్యూస్‌లెటర్ వివేచన ప్రచురణకు ఎడిటోరియల్ బోర్డు పనిచేస్తోంది వీసీ, రిజిస్ట్రార్లతో పాటు చీఫ్ ఎడిటర్, ఎటిటర్, ఎడిటర్ కన్వీనర్‌లు సహాయంతో పుస్తకాన్ని వెలువరిస్తారు.

పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

● విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు వెంకన్నగౌడ్



మాట్లాడుతున్న సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ వెంకన్నగౌడ్

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రం కురవి రోడ్డులో ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణకు ప్రతీ గౌడ కులస్థుడు, బహుజన వాదులు తరలివచ్చి విజయవంతం చేయాలని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ అధ్యక్షుడు జేరిపోతుల వెంకన్నగౌడ్ కోరారు. మహబూబాబాద్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని కురవి గేటు వద్ద ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఈనెల 16న ఆవిష్కరించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గత ఆరు నెలలుగా జిల్లాలోని గౌడ కులస్థుల సహాయసహకారాలతో ఏర్పాటు చేసిన ధీరుడు సర్వాయి పాపన్న విగ్రహావిష్కరణ 16న ఉదయం 10 గంటలకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, విశిష్ట అతిధులుగా స్థానిక శాసన సభ్యుడు భూక్య మురళీనాయక్, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మగాని మహేష్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ స్పీకర్, డోర్నకల్ శాసన సభ్యుడు జాటోతు రాంచందర్‌నాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్, రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్రతో పాటు గౌడ సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, వివిధ రాజకీయ పార్టీల జిల్లా అధ్యక్షులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్ వద్ద ముఖ్యఅతిథులకు స్వాగతం పలికి అక్కడి నుంచి 2500 బైకులతో కురవి గేటు వరకు ర్యాలీగా చేరుకొని విగ్రహావిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. అక్కడే 10 వేల మందితో బహిరంగ సభ ఉంటుందని, జిల్లాలోని గౌడ కులస్థులు, బహుజన వాదులంతా హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కమిటీ బాధ్యులు ముత్యం వెంకన్న, సుధగాని మురళి, గునిగంటి కమలాకర్, బిక్కి వెంకటేశ్వర్లు, పెద్ది వెంకన్న, నక్క నాగార్జున, బెల్లంకొండ శ్రీనివాస్, చిత్తనూరి శ్రీనివాస్, ఈరగాని బిక్షం, గండి వీరేందర్, ముంజాల రాజేందర్, బండి దీపక్ పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా

● పోలీస్ స్టేషన్ల పరిధిలో సైబర్ వారియర్స్ నియామకం ● ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ క్రైం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ జిల్లాలోని ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో సైబర్ వారియర్స్‌ను నియమించి, సైబర్ మోసాలపై నిఘాను కట్టుదిట్టం చేస్తున్నామని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ అన్నారు. జిల్లా పోలీస్ హెడ్ కార్టర్‌లో సైబర్ వారియర్లకు గురువారం టీ షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ బ్యూరో వారు అందజేసిన టీ షర్ట్‌లను జిల్లాలోని అని పోలీస్‌స్టేషన్ల సైబర్ వారియర్స్‌కు అందజేసినట్లు తెలిపారు. సైబర్ వారియర్స్ తమ స్టేషన్ పరిధిలో అందిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. సాక్ష్యాధారాలను సేకరించి, అత్యాధునిక పరిజ్ఞానం ఉపయోగిస్తూ సైబర్ నేరాలకు సంబంధించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కారం అయ్యేలా కృషి చేయాలన్నారు. ఇంటర్నెట్, సోషల్ మీడియా, ఆన్‌లైన్ బ్యాంకింగ్, ఫోన్‌కాల్స్ ద్వారా జరిగే మోసాలను నియంత్రణ కోసం ప్రజలను అవగాహన పర్చాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సైబర్ నేరగాళ్లను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ కె.శ్రీనివాస్, ఎస్సై బి.కరుణాకర్, సైబర్ వారియర్స్ ఉన్నారు.



సైబర్ వారియర్‌కు టీషర్ట్ పంపిణీ చేస్తున్న సుధీర్‌రాంనాథ్ కేకన్

● ఎస్పీని కలిసిన పదోన్నతి పొందిన అధికారులు..

పదోన్నతిపై మహబూబాబాద్‌కు వచ్చిన ఇద్దరు ఎస్సైలు జిల్లా ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఖమ్మం కమిషనరేట్ పరిధిలోని ఎస్.శ్రీను, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన టి.రామారావు 1990 బ్యాచ్‌కు చెందినవారు ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ నుంచి ఏఆర్ ఎస్సైగా పదోన్నతిపై మహబూబాబాద్ జిల్లాకు వచ్చారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో క్రమశిక్షణ, నిబద్ధతతో పని చేసి సమాజంలో గౌరవ మర్యాదలు పొందాలన్నారు.

మానుకోటకు చేరిన రేజాంగ్‌లా రాజ్ కలశయాత్ర



యాత్ర నిర్వాహకుడు జక్కుల శ్రీనివాస్‌యాదవ్‌ను స్వాగతిస్తున్న అఖిల భారత యాదవ మహాసభ నేతలు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : అహిర్ (యాదవులు) రేజిమెంట్ స్థాపన డిమాండ్‌తో మాజీ సైనికుడు జక్కుల శ్రీనివాస్ యాదవ్ చేపట్టిన 'రేజాంగ్‌లా రాజ్ కలశయాత్ర' మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి గురువారం సాయంత్రం చేరుకుంది. డోర్నకల్ నుంచి జిల్లా కేంద్రానికి చేరుకున్న ఈ యాత్రకు స్థానిక జ్యోతిబాఫూలే విగ్రహం వద్ద అఖిలభారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో యాదవ కులస్థులు ఘన స్వాగతం పలికారు. యాత్ర నిర్వాహకులు శ్రీనివాస్‌యాదవ్‌ను ఘనంగా సత్కరించారు. అక్కడ్నుంచి పట్టణ పురవీధుల గుండా నర్సంపేట బైపాస్ సెంటర్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ 1962లో భారత్-చైనా యుద్ధంలో 114 మంది హర్యానా రాష్ట్రం అహిర్వాల్‌కు చెందిన యాదవ సైనికులు చనిపోయారని, వారిని స్మరించుకోవడమే ఉద్దేశంగా రేజాంగ్‌లా యాత్రను చేపడుతున్నట్లు చెప్పారు. యాదవ సైనికుల స్మారకార్థం అహిర్‌రేజిమెంట్ (సైనికుల శిక్షణ కేంద్రం) స్థాపించాలని కోరారు. అక్కడ్నుంచి నర్సంపేటకు యాత్ర బయలు దేరి వెళ్లింది. ఈ కార్యక్రమంలో అఖిలభారత మహాసభ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎడ్ల వేణుమాధవ్, భట్టు శ్రీనివాస్, కాంగ్రెస్ ఓబీసీ సెల్‌రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల వీరన్న, ఎడ్ల రమేష్, నర్సింగం శ్రీనివాస్, కోడి శ్రీనివాస్, పోతురాజు రాజు, స్వర్ణలత, చెవిటి ఐలయ్య, మునలయ్య, తేళ్ల శ్రీనివాస్, మహేష్, మల్లేష్ పాల్గొన్నారు.

ఇఫ్టూ రాష్ట్రస్థాయి తరగతులు వాయిదా

జిల్లా కార్యదర్శి శివారపు శ్రీధర్

కేసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా కేసముద్రంలో ఈనెల 15, 16 తేదీల్లో నిర్వహించే ఇఫ్టూ రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులను సెప్టెంబర్ 13, 14 తేదీలకు వాయిదా వేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి శివారపు శ్రీధర్ ప్రకటించారు. కేసముద్రంలో గురువారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా కార్మిక సంఘ నాయకులు హాజరుకావాల్సిఉందని, వర్షాల కారణంగా రాకపోకలకు ఆటంకం ఏర్పడుతున్నందున వాయిదా వేసినట్లు తెలిపారు. ఆయన వెంట సంఘం జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేష్, భూక్య రాములు ఉన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నూతనంగా ప్రవేశ పెట్టిన ఆరు నూతన కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ బాబు అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురువారం జాయింట్ కమీషనర్ ఆఫ్ లేబర్ అధికారి రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన అవగాహన సదస్సు నిర్వహించి, అందుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాబు మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ ఏటీఐని అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్‌గా అప్‌గ్రేడ్ చేసి 4.0 అవసరాలకు అనుగుణంగా ప్రవేశ పెట్టిన 6 నూతన కోర్సుల ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన యువతీ, యువకులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిట్టర్, ఎలక్ట్రిషియన్, మెకానిక్ డీజిల్, మ్యానుప్యాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమెషిన్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానుపాక్చరింగ్ టెక్నీషియన్, ఆర్టిస్టన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్, బేసిక్ డిజైనర్, వర్చువల్ వెరిఫైడ్ (మెకానికల్), అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికిల్ (ఈవీ) కోర్సుల ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్ https://www.iti.telangana.gov.in దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న హార్డ్ కాపీలను ఐటీఐ కళాశాలలో ఈనెల 28న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు అందజేయాలన్నారు. అధికారులు నరేష్, రజిత, ఉప్పలయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మానుకోటలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



మాట్లాడుతున్న బీజేపీ పట్టణ అధ్యక్షుడు అజయ్

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవంను పురస్కరించుకొని మహబూబాబాద్‌లో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ యాత్రను బీజేపీ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పట్టణంలోని కోర్టు సెంటర్ నుంచి వివేకానంద సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మానుకోట పట్టణ అధ్యక్షుడు వెన్నమల అజయ్ మాట్లాడారు. బూత్‌స్థాయి నుంచి ప్రతీ కార్యకర్త ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు వల్లభు వెంకటేశ్వర్లు, వద్దిరాజు రాంచందర్‌రావు, క్యాచువల్ శ్యాంసుందర్‌శర్మ, గడ్డం అశోక్, ధారా ఇందుభారతి, డాక్టర్ రవీందర్‌నాయక్, జేహేందర్‌నాయక్, రవి, స్వామి, ఓర్సు పద్మావతి, వెన్నమల సందీప్, శివ, శంకర్ పాల్గొన్నారు.

రైతులు నానో యూరియాను వాడాలి



నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు

కేసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులు సాంప్రదాయ గలికల యూరియాకు బదులుగా నానో యూరియాను వాడుకోవచ్చని మహబూబాబాద్ సహాయ వ్యవసాయ సంచాలకులు అజ్మీరా శ్రీనివాసరావు సూచించారు. కేసముద్రంలో గురువారం ఏవో బి.వెంకన్నతో కలిసి పలు ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లోని నిల్వ, అమ్మకాలు, కొనుగోళ్ల రిజిష్టర్లను, పీవోఎస్ మిషన్‌లో అమ్మకాలను పరిశీలించారు. ఎరువులను అక్రమంగా నిల్వ చేసి డీలర్లు కృత్రిమ కొరత సృష్టిస్తే నిత్యావసర వస్తువులు, ఎరువుల నియంత్రణ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు అధైర్యపడవద్దని దఫాల వారీగా యూరియా నిల్వలు వస్తున్నాయని తెలిపారు. వారి వెంట ఏఈవోలు, సిబ్బంది ఉన్నారు.



కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

ఓటు చోరీకి వ్యతిరేకంగా గళం విప్పాలి

● డీసీసీ అధ్యక్షుడు భరత్‌చందర్‌రెడ్డి

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రతీ ఒక్కరు తమ గళం విప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి అన్నారు. ఏఐసీసీ పిలుపులో భాగంగా మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం రాత్రి ఓట్ చోర్.. గద్దీ చోడ్ పేరిట కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా భరత్‌చందర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ హయంలో అనేక రాష్ట్రాల్లో ఓట్లు గల్లంతయ్యాయని ఆరోపించారు. ఓటు చోరీ ఉద్యమాన్ని కాంగ్రెస్ ఆధ్వర్యంలో మరింత ఉధృతం చేస్తామని, ఇందులో ప్రతీ ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు దేవరం ప్రకాష్‌రెడ్డి, ఖలీల్‌పాషా, రామగోని రాజు, నీరుటి సురేష్‌నాయుడు, నాళ్ల లక్ష్మీనర్సింహారావు, బెల్లంకొండ శ్రీనివాస్, ఎడ్ల రమేష్, చలమల నారాయణ పాల్గొన్నారు.

దేశం కోసం ప్రాణాలర్పించిన వీరులకు నివాళులు

మహబూబాబాద్ టౌన్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ అంబేద్కర్ సెంటర్‌లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం రాత్రి దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి ప్రాణాలర్పించిన యోధులకు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శంతన్‌రామరాజు మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది పోరాడి అమరులయ్యారని, వారి త్యాగాల పునాదులపై స్వాతంత్ర్యం సిద్ధించిందని చెప్పారు. 1947 ఆగస్టు 14న దేశం ముక్కలైన విషాదఘట్టాన్ని స్మరించుకుంటూ అసువులు బాసిన వీరులకు నివాళులు అర్పించామని చెప్పారు. దేశ చరిత్రలో అత్యంత దుర్దినమని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రామరాజు ఉపేందర్, పిట్టల చంద్రశేఖర్, గండు కార్తీక్, గంగాధర్ బాలరాజు, అవేత్‌కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

మోదీ కృషి ప్రతీ ఒక్కరికి ఆదర్శం

పెద్దవంగర, ఆగస్టు 13 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ దేశ భద్రత, అభివృద్ధి కోసం చేస్తున్న కృషి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములుగౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ప్రతి ఇంటికి చేరవేయాలనే లక్ష్యంతో బీజేపీ మండల అధ్యక్షుడు కట్టోజు భాస్కరాచారి అధ్యక్షతన బైకుర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేసి జాతి ఐక్యతకు కృషి చేయాలని కోరారు. ఆపరేషన్ సిందూర్‌లో భారత్ సాధించిన చరిత్రాత్మక విజయం మన యువతలో స్ఫూర్తిని నింపుతుందన్నారు. గ్రామాల్లో బుత్‌స్థాయి నుంచి పటిష్ఠం చేస్తు బీజేపీ పార్టీ అభివృద్ధికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు. గ్రామాల్లో యువత మోదీ నాయకత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో పాలకుర్తి అసెంబ్లీ కన్వీనర్ శ్రీమాన్, బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఝాన్సీ, పల్లె కుమార్, సుధాకర్, సందీప్‌కుమార్, రాము, తలారి సోమయ్య, ఆనంద్, రవి, కిరణ్, అశోక్, శ్రీకాంత్, ప్రశాంత్, దాసు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డెక్కిన రైతులు

● వరంగల్-ఖమ్మం హైవేపై కర్షకుల ధర్నా

తొర్రూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : రైతులకు సకాలంలో యూరియా అందించాలని ప్రభుత్వం ఆదేశించినా అధికారులు సొసైటీ నిర్వాహకులు కుమ్మక్కై యూరియా నిల్వలను పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపిస్తూ గురువారం తొర్రూరులో రైతులు వరంగల్-ఖమ్మం హైవే రోడ్డుపై ధర్నా నిర్వహించారు. వీరికి బీఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు, బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్న వ్యవసాయాధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవని, యూరియా కావాలంటే ఇతర ఫర్టిలైజర్ గుళికలు కొనాలని లింకులు పెడుతున్నారని, రైతులకు యూరియా అందించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని, ప్రైవేటు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నా వ్యవసాయ అధికారులు మామూళ్ల మత్తులో స్పందించడం లేదని, సీజన్ వారీగా మామూళ్లు తీసుకుంటూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వెంటనే రైతులకు యూరియా అందజేయాలని, లేనిచో ఉద్యమాలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీతారాములు, శ్రీనివాస్, ఐలయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

తొలితరం విప్లవవీరుడు పాపన్న

చిన్నగూడూరు, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బడుగు, బలహీన వర్గాల కోసం పోరాటం చేసిన తొలితరం విప్లవ వీరుడు సర్దార్ సర్వాయిపాపన్న అని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్ కొనియాడారు. మండల కేంద్రంలోని దాశరథి సెంటర్‌లో గురువారం పాపన్న 375వ జయంతి వేడుకలను మండల గోపా సంఘం బాధ్యుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడీ పాలన కొనసాగుతున్న సందర్భంలో ఛత్రపతి శివాజీ, పాపన్నలు మొఘల్ పాలనకు వ్యతిరేకంగా వీరోచితంగా పోరాటంచేసి పేద ప్రజలకు అండగా, దోపిడీ పాలనకు ఎదురొడ్డి భారతమాత ఉక్కు సంకెళ్లను తెంచడానికి ప్రాణాలు పణంగా పెట్టి పోరాటం చేశారని గుర్తు చేశారు. గోల్కొండను ఏలిన మొట్టమొదటి తెలుగు బహుజన విప్లవ వీరుడు పాపన్న జీవితం నేటితరం యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో తొర్రూర్ మండల గోపా అధ్యక్షుడు రాయపెల్లి యాకయ్య, కౌండిన్య సహకార పరపతి సంఘం ప్రధాన కార్యదర్శి కుంభం మహేశ్, గౌడ యువజన సంఘం జిల్లా కార్యదర్శి గాడిపెల్లి అనిల్, కారుపోతుల సారయ్య, భర్తపురం కొమురెల్లి, జీవన్, పొన్నం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



హరిప్రియ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న కార్యకర్తలు

మాజీఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక

బయ్యారం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బయ్యారంలో వివిధ పార్టీల నుంచి ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ సమక్షంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాతా గణేష్‌ఆధ్వర్యంలో గురువారం ఆ పార్టీలో చేరారు. జగ్గుతండాలో కొమ్ము రాజుల నాగరాజు ఆధ్వర్యంలో 55 కుటుంబాలు పార్టీలో చేరినట్లు ఆయన తెలిపారు. సొసైటీ వైస్ ఛైర్మన్ గంగుల సత్యనారాయణ, ఎనుగుల ఐలయ్య, బానోత్ శ్రీను, లక్ష్మణ్, రేపాకుల వెంకన్న, జర్పుల శ్రీను పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బ్యాగ్ మహిళకు అందచేత

మరిపెడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ బస్టాండ్‌లో బుర్హాన్‌పురం గ్రామానికి చెందిన తాటికొండ మంజుల గురువారం బ్యాగ్‌ను పోగొట్టుకుంది. ఆమె పోలీసులను ఆశ్రయించింది. మరిపెడ ఎస్సై సతీశ్‌గౌడ్ తన సిబ్బందిని అలర్ట్ చేసి పోయిన బ్యాగ్‌ను గంట వ్యవధిలోనే దొరకపట్టుకుని బాధిత మహిళకు అందచేశారు. ఆ బ్యాగ్‌లో రూ.20వేల విలువైన ఆండ్రాయిడ్ ఫోన్, రూ.పది వేల నగదు, విలువైన డాక్యుమెంట్ పేపర్లు, డెబిట్, క్రెడిట్ కార్డులు ఉన్నాయి. బాధిత మహిళ ఎస్సై సతీశ్‌గౌడ్, పోలీస్ సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది.

విగ్రహ ఆవిష్కరణను జయప్రదం చేయాలి

మరిపెడ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో శుక్రవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలని గోపా మండల కార్యదర్శి లింగాల మహేశ్‌గౌడ్ గురువారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన గుండెపుడిలో విలేకరులతో మాట్లాడారు. అనాడు మొఘల్ అధికారులు, దేశపాండ్యులు, జమీందారులు పేదలపై అన్యాయం చేసినప్పుడు పాపన్నగౌడ్ తిరుగుబాటు చేశాడని గుర్తు చేశాడు. సర్వాయి పాపన్న వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని బీసీలకు రాజ్యాధికారం వచ్చే వరకు పోరాడాలన్నారు. అందుకే జిల్లాలో ఉన్న గౌడ్ కులస్తులందరూ హాజరై విజయవంతం చేయాలన్నారు.

టీజీ ఈజీసీ డైరెక్టర్‌కు సన్మానం

కొత్తగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ శాఖ అనుబంధ తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ కౌన్సిల్ (టీజీ ఈజీసీ) డైరెక్టర్ చల్లా నారాయణరెడ్డికి కోనాపురం గ్రామ కాంగ్రెస్ నాయకులు గురువారం ఘనంగా సన్మానం చేశారు. నారాయణరెడ్డికి బ్లాక్ కాంగ్రెస్ ఉపాధ్యాక్షుడు కర్ర జనార్ధన్ రెడ్డి శాలువా కప్పి, సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణ, నిబద్ధతతో పనిచేస్తే కాంగ్రెస్ పార్టీలో ప్రతీ ఒక్క కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని, ఉన్నతమైన పదవులు దక్కుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుంజ భిక్షపతి, గ్రామ కమిటీ అధ్యక్షుడు బొల్లం ఐలయ్య, మండల యూత్ అధ్యక్షుడు బోయినేనీ ప్రశాంత్‌రెడ్డి, నాయకులు పబ్బతి సాంబరెడ్డి, సుభాష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సంజీవరెడ్డి, సంతోష్, ఉపేందర్, మల్లయ్య రాజు, నరసింహస్వామి పాల్గొన్నారు.

ఆరు నెలలుగా నిర్వహించని గ్రామసభ

కురవి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) :కురవి గ్రామసభ ఆరు నెలలుగా నిర్వహించడం లేదని, తద్వారా గ్రామంలో సమస్యలు పేరుకుపోయాయని బీఆర్ఎస్ నాయకులు సంగెం భరత్, దుడ్డెల వినోద్ ఆరోపించారు. ఈ మేరకు కురవి తహసీల్దార్‌కు గురువారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామసభ నిర్వహణ లేకపోవడం వల్ల అన్ని బజారులకు తాగునీటి సరఫరా సరిగాలేదని, వీధిలైట్ల నిర్వహణ, మురుగు కాల్వలు శుభ్రం చేయడం లాంటి పనులు జరగడం లేదన్నారు. ఇప్పటికైనా గ్రామసభ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మేడి ప్రశాంత్, కె.వినయ్, సంపత్, సందీప్, ప్రశాంత్, వీరన్న పాల్గొన్నారు.

కరెంట్ సరఫరా అంతరాయం లేకుండా చర్యలు

కొత్తగూడ, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ, గంగారం మండలాలకు విద్యుత్ అంతరాయం కలుగకుండా సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని సీతః రాజుచౌహాన్ పేర్కొన్నారు. సాధిరెడ్డిపల్లిలో గురువారం 33 కేవీ లైన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండు మండలాల ప్రజలకు విద్యుత్ అంతరాయం లేకుండా సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ విజేందర్‌రెడ్డి, డీఈలు విజయ్, సునీత, ఏడీఈలు కవిత, ఐలయ్య, ఏఈలు సురేష్, రమణ పాల్గొన్నారు.

కెనరా విద్యాజ్యోతి పథకానికి కల్వల విద్యార్థుల ఎంపిక

కేసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్వల జడ్పీ ఉన్నత పాఠశాలలోని ఆరుగురు విద్యార్థినీలు కెనరా బ్యాంకు అందించే కెనరా విద్యాజ్యోతి పథకానికి ధరావత్ నవ్య, అజ్మీర నిహారిక, బాదావత్ మేఘన, బానోత్ ఝాన్సీ, అనూష, భూక్య కావ్య ఎంపికైనట్లు హెచ్ఎం బండారు నరేందర్ గురువారం తెలిపారు. బ్యాంకు కార్పోరేట్ సామాజిక బాధ్యతగా వికసిత్ భారత్‌లో భాగంగా గిరిజన బాలికల విద్యను ప్రోత్సహించేందుకు ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు రూ.3వేల చొప్పున, 8 నుంచి పదో తరగతి విద్యార్థినులకు రూ.5వేల చొప్పున నగదును అందించేందుకు ఆ బ్యాంకు అమనగల్ బ్రాంచి మేనేజర్ అజ్మీరా జగన్, ఫీల్డ్ ఆఫీసర్ కొడారి శరత్‌చంద్ర ఎంపిక చేశారని తెలిపారు.

చట్టాలను అమలు చేయాలి

● పీవోడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంగ

మహబూబాబాద్ రూరల్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : మహిళల రక్షణ కోసం చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మంగ అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం స్త్రీలపై జరుగుతున్న దాడులు, చట్టాల అమలు తీరుపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలపై జరుగుతున్న దాడులకు వ్యతిరేకంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలను అమలుచేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని ఆరోపించారు. వలస కూలీలు, మహిళలకు ఉద్యోగ భద్రత, ఆరోగ్య రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఊకె పద్మ, బోనగిరి మధు, కవిత, విద్యార్థినులు పాల్గొన్నారు.

బీసీ బిల్లును పార్లమెంటులో ఆమోదించాలి

కేసముద్రం, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి పంపిన బిల్లును పార్లమెంటులో ఆమోదించాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఆకుల రాజు డిమాండ్ చేశారు. కేసముద్రంలో గురువారం నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీకి రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలు, ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారనిని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యుడలు మార్తినేని పాపారావు, చాగంటి కిషన్, బొబ్బాల యాకూబ్‌రెడ్డి, కావటి నర్సయ్య, జల్లె జయరాజు, మోడెం వెంకటేశ్వర్లు, నీరుటి జలెందర్, తాడబోయిన శ్రీశైలం, అల్లుగొండ సావిత్ర, జాటోత్ వెంకన్న, ఎల్లయ్య పాల్గొన్నారు.

పశువుల కొట్టం కూలి మేకలు మృతి

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరుజల్లులు కురిశాయి. గూడూరు మండలం భూపతిపేటలో మాత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. మిగతా మండలాల్లో జల్లులు కురిశాయి. గత కొద్దిరోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు బయ్యారం మండలం కొత్తపేటలో కొప్పుల శ్రీరాంకు చెందిన పశువుల కొట్టం కూలి రెండు మేకలు మృతి చెందాయి. ప్రభుత్వం తనకు ఆర్థిక సాయం అందించి విజ్ఞప్తి చేశాడు. డోర్నకల్, ఇనుగుర్తి, మరిపెడ, సీరోలు, నెల్లికుదురు, కొత్తగూడ, గార్ల, దంతాలపల్లి, నర్సింహులపేట, కేసముద్రం, బయ్యారం, కురవి, మహబూబాబాద్ మండలాల్లో చిరుజల్లులు కురిశాయి. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం 8.30 గంటల వరకు 289.6 మిల్లిమీటర్ల వర్షపాతం కురిసింది. కొత్తగూడలో రాత్రి భారీ వర్షం కురిసింది. సగటున 18.1 మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఐలయ్యబావితండాలో తీజ్ పండుగ



ఐలయ్యబావితండాలోతీజ్ ఉత్సవాల్లో పాల్గొన్న గిరిజనులు

ఇనుగుర్తి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి) : చీన్యాతండా జీపీ శివారు ఐలయ్యబావితండాలో గురువారం తీజ్ పండుగను నిర్వహించారు. గిరిజన బాలికలు తొమ్మిదిరోజుల పాటు మంచెపై పూజలు చేసి పెంచిన గోధుమ నారు బుట్టలను ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు